సాక్షి మంచిర్యాల

శుక్రవారం । 18 । ఏప్రిల్ । 2025



జగమెరిగిన సత్యం

చింతలమానెపల్లి మండలం దిందా గ్రామం వెండితెరపై మెరువనుంది. గ్రామీణ ప్రాంత నేపథ్యంలో సాగే సినిమా జగమెరిగిన సత్యం ఇక్కడే చిత్రీకరించారు.

10లో▸



గురువుల శ్రద్ధ

ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుల ప్రత్యేక శ్రద్ధ వల్ల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. గురుకులాల ప్రవేశ పరీక్ష రాసి చాలామంది సీటు దక్కించుకున్నారు.

11లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 38.0 /28.0

గరిష్ట ఉష్ణోగ్రతలు మరింతగా పెరుగుతాయి. వడగాలులు వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది. ఆకాశం రాత్రివేళ మేఘావృతమై ఉంటుంది.

న్యూస్‌రీల్

ఎల్‌ఆర్‌ఎస్ రుసుం వసూలు వేగవంతం చేయాలి

- రాష్ట్ర పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్



పాల్గొన్న కలెక్టర్ కుమార్ దీపక్, అధికారులు

మంచిర్యాలఅగ్రికల్చర్: ఎల్‌ఆర్‌ఎస్‌లో భాగంగా భూముల క్రమబద్ధీకరణ కోసం అందిన దరఖాస్తులకు సంబంధించి అర్హులైన లబ్ధిదారుల నుంచి రుసుం వసూలు ప్రక్రియ వేగవంతం చేయాలని రాష్ట్ర పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్ అన్నారు. గురువారం హైదరాబాద్ నుంచి ఇతర ఉన్నత అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీ అధికారులతో ఎల్‌ఆర్‌ఎస్ రుసుం వసూలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులు ఈ నెల 30లోగా చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, రుసుం చెల్లించిన వారికి ప్రొసీడింగ్స్ అందజేయాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు, మున్సిపల్ కమిషనర్లు, అధికారులు పాల్గొన్నారు.

బ్యాంక్ గ్యారంటీలు ఇవ్వాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మోతిలాల్

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో 2024–25 యాసంగి వరిధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభించామని, రైస్‌మిల్లర్లు పాత బకాయిలు పూర్తి చేసి బ్యాంక్ గ్యారంటీలు ఇవ్వాలని జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్ అన్నారు. గురువారం జిల్లా అదనపు కలెక్టర్ చాంబర్‌లో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళతో కలిసి బాయిల్డ్ రైస్‌మిల్లర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ కనీస మద్దతు ధరతో వరిధాన్యం కొనుగోలు చేస్తామని, సన్నరకం ధాన్యానికి మద్దతు ధరతోపాటు బోనస్ అందిస్తామని తెలిపారు. ధాన్యం దిగుమతి ఎలాంటి కోతలు లేకుండా చేయాలన్నారు. అధికారులు, బాయిల్డ్ రైస్‌మిల్లర్లు పాల్గొన్నారు.

భూభారతిపై సదస్సులు



హాజీపూర్‌లో భూభారతి చట్టంపై వివరిస్తున్న కలెక్టర్ కుమార్‌దీపక్

- క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్న అధికారులు
- భూ సమస్యలు పరిష్కారమైతే బాధలు తీరినట్లే..

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ధరణి స్థానంలో భూభారతి పోర్టల్ రాకతో జిల్లాలో భూ సమస్యలు తీరుతాయనే ఆశలు నెలకొన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌వోఆర్ చట్టానికి సవరణ చేసి నూతనంగా 2024 చట్టం తీసుకొచ్చింది. ఈ క్రమంలో జిల్లాలో భూభారతి పోర్టల్‌పై క్షేత్రస్థాయిలో అవగాహన సదస్సులు నిర్వహిస్తోంది. రెవెన్యూ సదస్సులు నిర్వహించాక పూర్తి స్థాయిలో రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయనున్నారు. జిల్లాలో అనేక చోట్ల భూ సమస్యలు పరిష్కారం కాక ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో అనేకమంది భూములు నిషేధిత జాబితా, ఆర్‌ఆర్వోఎఫ్‌ఆర్ సంబంధించి అవరోధాలు తలెత్తాయి. ఇప్పటికీ ప్రతీ సోమవారం ప్రజా ఫిర్యాదుల విభాగంలో భూ సమస్యలపైనే అనేక మంది అర్జీలు ఇస్తున్నారు. భూ తగదాలు, కోర్టు కేసులతోపాటు వారసత్వ బదిలీలు సైతం ఇబ్బందిగా మారాయి. జిల్లాలో భూ యజమానుల మధ్య సరిహద్దు సమస్యగా 20వేల ఎకరాలు ఉన్నాయి. అంతేకాక భూ ప్రక్షాళన సందర్భంగా పలు బోగస్ పట్టాలు సైతం ఉన్నట్లు వెల్లడయ్యాయి. కొందరు ఎలాంటి మోకాపై లేకున్నా పట్టాలు పొందిన ఘటనలు ఉన్నాయి. ఇక సీలింగ్, అసైన్డ్‌దారులు పట్టాలో ఒకరి పేరు కాస్తులో మరొకరి పేరుతో ఉన్నారు. ఏళ్లుగా అనుభవదారులుగా ఉంటున్నా హక్కులు రావడం లేదు.

పరిష్కారం కోసం..

జిల్లాలో ఇప్పటికీ అనేక మంది తమ భూమి హక్కుల కోసం ఇబ్బందులు పడుతున్నారు. భూ ప్రక్షాళన సందర్భంగా దొర్లిన తప్పులతో తర్వాత సరిదిద్దే అవకాశం లేకుండా పోయింది. అనేక సార్లు రెవెన్యూ అధికారులకు మొర పెట్టుకున్నా ఆ మేరకు పరిష్కారం కావడం లేదు. ఇప్పటికీ జిల్లాలో సాదాబైనామాల అర్జీలు పెండింగ్‌లోనే ఉన్నాయి. తెల్లకాగితాలపై జరిగిన లావాదేవీలకు మోక్షం కలుగడం లేదు. అసైన్డ్, అటవీ, సింగరేణి భూముల మధ్య వివాదాలు ఉన్నాయి. పార్ట్–బీగా పేర్కొన్న నిషేధిత జాబితాలో పెండింగ్‌లోనే ఉన్నాయి. పూర్తి స్థాయిలో సర్వే జరగకపోవడంతో వివాదాలు కొనసాగుతున్నాయి.

కొత్త చట్టంపైనే ఆశలు

కొత్త చట్టంతో భూ చిక్కులు తీరుతాయనే ఆశలు నెలకొన్నాయి. భూభారతిలో ఇక నుంచి ప్రతీ కమతానికి భూధార్ పేరుతో ప్రత్యేక గుర్తింపు సంఖ్య, నంబర్లు ఇస్తున్నారు. అంతేకాక రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లు సులభంగా చేసేలా కొత్త చట్టాన్ని రూపొందించారు. డేటా ఎంట్రీ, స్టాంపు రిజిస్ట్రేషన ఫీ చెల్లింపు, ఈ చలాన్, స్లాట్ బుకింగ్, వంటి సేవలు మెరుగుపర్చారు. ఇక కొత్త పోర్టల్‌లో భూమిత్రతో ఏఐ(కృత్రిమ మేధ)తో అన్నివిధాల సహాయ సహకారాలు అందేలా ఏర్పాట్లు చేయనుంది. తహసీల్దార్లు, ఆర్డీవోలకు సైతం మ్యుటేషన్ అధికారం కల్పించడం వంటివి కొత్త చట్టంలో ఉన్నాయి. తహసీల్దార్, ఆర్డీవోల స్థాయిల్లోనే సాదాబైనామాలు, రిజిస్ట్రేషన్, తర్వాత మ్యుటేషన్లు జరగనున్నాయి. ఆన్‌లైన్‌లో నమోదు, వారసత్వ భూముల మార్పిడి సరళతరం చేశారు. వేగంగా సులభంగా భూ హక్కులు పొందితే భూ యజమానులకు తిప్పలు తప్పే అవకాశం ఉంది.

జిల్లాలో భూ స్వరూపం

మొత్తం విస్తీర్ణం	4016.46చ.కి.మీ.
అటవీ భూమి	1761.17చ.కి.మీ.
రెవెన్యూ గ్రామాలు	382
మొత్తం సాగు భూమి	3,30,891.403 ఎకరాలు.
సగటు భూ కమతం	2.29ఎకరాలు
ప్రస్తుతం భూభారతి పెండింగ్ అర్జీలు	1620

రైతులు చట్టం వివరాలు తెలుసుకోవాలి

- పెండింగ్ సమస్యల పరిష్కారానికి అవకాశం
- జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి నూతన ఆర్‌ఓఆర్ చట్టం ద్వారా భూ సమస్యల పరిష్కారానికి అవకాశం లభిస్తుండగా చట్టంలో పొందుపరచిన అంశాలను రైతులు వివరంగా తెలుసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం హాజీపూర్ మండల కేంద్రంలోని శ్రీనివాస గార్డెన్స్‌లో భూభారతి చట్టంపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మాట్లాడారు. భూభారతి నూతన చట్టం ద్వారా హక్కులు, రికార్డుల్లో తప్పుల సవరణకు అవకాశం కల్పించిందని అన్నారు. పెండింగ్, సాదాబైనామా దరఖాస్తులు పరిష్కరించడం, వారసత్వంగా వచ్చిన భూములను విరాసత్ చేసే ముందు నిర్ణీత కాలంలో సమగ్ర విచారణ చేయడం, భూమి హక్కులు ఏ విధంగా సంక్రమించినా మ్యుటేషన్ చేసి రికార్డులో నమోదు చేయడం జరుగుతుందని అన్నారు. భూభారతి ద్వారా ఆగస్టు 15లోగా జిల్లాలోని అన్ని మండలాల్లోనూ అన్ని రకాల భూ సమస్యలు పరిష్కరించేలా కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్, ఆర్డీఓ శ్రీనివాసరావు, డీఆర్‌డీఓ కిషన్, తహసీల్దార్ శ్రీనివాసరావుదేశ్‌పాండే, ఎంపీడీఓ ప్రసాద్, ఏఓ కృష్ణ, ఈజీఎస్ ఏపీఓ మల్లయ్య, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.



భూభారతి చట్టంపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ వీక్షిస్తున్న కలెక్టర్, అధికారులు, రైతులు

నవోదయ పాఠశాల ఏర్పాటు స్థలం పరిశీలన

హాజీపూర్ మండలం గఢ్‌పూర్‌లో నవోదయ పాఠశాల ఏర్పాటు ప్రతిపాదిత స్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాసరావుదేశ్‌పాండే ఉన్నారు.

కొందరికే కుట్టు పని..!

- స్కూల్ యూనిఫాం కుట్టు పని నిబంధనలు గల్లంతు
- అర్బన్ ప్రాంతంలో గంపగుత్తగా అప్పగింత
- ఒక్కో మహిళా గ్రూపునకు ఆరు నుంచి పదికి పైగా పాఠశాలలు
- అస్పష్ట కొలతలతో ఇబ్బందులు



ఓ పాఠశాలలో కొలతలు తీసుకుంటున్న సభ్యులు

మంచిర్యాలఅర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పంపిణీ చేయనున్న యూనిఫాంలు కొలతల ఆధారంగా కుట్టాల్సి ఉన్నా అలాంటిదేమీ కనిపించడం లేదు. గత ఏడాది జిల్లా కేంద్రంలోని ఓ పాఠశాల విద్యార్థులకు పంపిణీ చేసిన యూనిఫాంలు పొట్టిగా, పొడుగ్గా, జేబులు ఊడిపోయి, దారం పోగులు లేచి అసౌకర్యంగా ఉన్నాయి. కొన్ని బడుల్లో కొలతలు తారుమారైన విషయాన్ని గ్రహించి అధికారులు దుస్తులను వెనక్కి పంపించారు. కొందరికి ఒక జత దుస్తులు అందగా.. మరో జత మూడు నెలలు దాటిన తర్వాత అందజేశారు. ఈసారి బడులు తెరిచే నాటికే యూనిఫాం అందజేయాలనే లక్ష్యంతో విద్యాశాఖ ముందస్తు చర్యలు చేపట్టింది. అధికారుల మధ్య సమన్వయ లోపమో.. ఏమోగానీ ఆరు నుంచి పదికి పైగా పాఠశాలలను గంపగుత్తగా ఒకే ఏజెన్సీ(ఎస్‌హెచ్‌జీ) మహిళలకు కుట్టు పని అప్పగించడం అనుమానాలకు తావిస్తోంది.

జిల్లాలో..

జిల్లాలో అర్బన్ ప్రాంతంలో 138 పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 13,866 మంది విద్యార్థులు ఉండగా.. బాలురు 6,247మంది, బాలికలు 7,619 మంది ఉన్నారు. గ్రామీణ ప్రాంతంలోని 630 పాఠశాలలల్లో 28,845మంది విద్యార్థులు ఉండగా.. బాలురు 13,774మంది, బాలికలు 15,071 మంది ఉన్నారు. జిల్లాలోని 10,417 సెల్ఫ్‌హెల్ప్ గ్రూపుల్లో 1,15,018మంది మహిళా సభ్యులు ఉన్నారు. కుట్టు పని నైపుణ్యం కలిగిన గ్రూపులను గుర్తించి ఆయా పాఠశాలల విద్యార్థులకు సంబంధించి యూనిఫాం వస్త్రం అప్పగించారు. ఒక్కో ఏజెన్సీ(మహిళా గ్రూపు)కి ఒక్కో పాఠశాల మాత్రమే అప్పగించాలి. కానీ అర్బన్ ప్రాంతంలో కొందరికే గంపగుత్తగా ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. ఒక్కో ఎస్‌హెచ్‌జీకి ఒకటి కంటే ఎక్కువ స్కూళ్ల విద్యార్థుల దుస్తులు కుట్టడానికి ఇవ్వడంపై అభ్యంతరం వ్యక్తమవుతోంది. మంచిర్యాల అర్బన్ ప్రాంతంలో 31 పాఠశాలల్లో మూడు మినహా 22 పాఠశాలలు ఒకే సెల్ఫ్‌హెల్ప్ గ్రూపునకు అప్పగించారు. మరో ఏజెన్సీకి 6, ఇంకో ఏజెన్సీ 2, ఒక ఏజెన్సీకి ఒక బడి విద్యార్థుల యూనిఫాం కుట్టు బాధ్యతలు అప్పగించారు. చెన్నూర్‌లో 17పాఠశాలలు ఉండగా.. ఒకే గ్రూపునకు 11 పాఠశాలలు అప్పగించారు. నస్పూర్‌లో 17 పాఠశాలలను ఒకే గ్రూపునకు అప్పగించారు. ఇందులో ఏడు పాఠశాలలు ఒక మహిళకు, ఐదేసి పాఠశాలలు మరో ఇద్దరికి బాధ్యతలు ఇచ్చారు. బెల్లంపల్లిలో 20 పాఠశాలలు ఉండగా 13 ఒక గ్రూపునకు, ఐదు మరో గ్రూపునకు ఇచ్చినా మహిళా సభ్యులు ముగ్గురు ఉన్నారు. క్యాతన్‌పల్లిలో 12 పాఠశాలల్లో 11 ఒకే గ్రూపునకు, లక్సెట్టిపేటలో 21 పాఠశాలలు ఉండగా.. 11 ఒక ఎస్‌హెచ్‌జీ మహిళకు ఆరు, మరో మూడు గ్రూపునకు కట్టబెట్టారు. మందమర్రిలో 19పాఠశాలల్లో ఎనిమిదింటిని ఒక గ్రూపునకు అప్పగించారు. ఒక్కో తరగతిలో ఒకే ఎత్తు కలిగిన ఐదుగురు విద్యార్థులకు ఒకే కొలతలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. గతంలో కూడా దర్జీలకు గంపగుత్తగా అప్పగించడం వల్లనే యూనిఫాం కొలతల్లో తేడా, నాణ్యమైన కుట్టు లేక దుస్తులు వేసుకోవడంలో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. మహిళలకు స్వయం ఉపాధి కల్పించాలనే ప్రభుత్వ ఆశయాన్ని నీరుగార్చి కొందరికే అప్పగించిన అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తమవుతోంది.

ఎస్‌హెచ్‌జీకి ఒకే పాఠశాల బాధ్యతలు

సెల్ఫ్‌హెల్ప్ గ్రూపునకు ఒక్క పాఠశాల విద్యార్థుల యూనిఫామ్ కుట్టు బాధ్యతలు అప్పగించాలి. ముందస్తుగా సెల్ఫ్‌హెల్ప్ గ్రూపు మ్యాపింగ్ చేశాం. నైపుణ్యం కలిగిన మహిళలకు శిక్షణ ఇచ్చాం. ఒకటి కంటే ఎక్కువగా గ్రూపునకు అప్పగించినట్లు మా దృష్టికి రాలేదు. నిబంధనలకు విరుద్ధంగా ఉంటే చర్యలు చేపట్టి మార్పులు చేస్తాం.

– డీఆర్‌డీవో కిషన్

మహిళా సంఘాలకు పెట్రోల్‌బంక్, సోలార్ ప్లాంట్లు మంజూరు

పాతమంచిర్యాల: మహిళా శక్తి పథకంలో భాగంగా జిల్లాలోని మహిళా సంఘాల సభ్యులకు పెట్రోల్ బంక్, రెండు సోలార్ ప్లాంట్లు మంజూరయ్యాయి. జిల్లాలోని మందమర్రి మండలం బొక్కలగుట్ట, దండేపల్లి మండలం వందూర్‌గూడలో రూ.3కోట్ల వ్యయంతో రోజుకు నాలుగు వేల యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేసే సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నారు. మందమర్రి మార్కెట్ ఏరియాలో భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్(బీపీసీఎల్) పెట్రోల్‌బంక్‌ను ఏర్పాటు చేయనున్నారు. బంక్ ఏర్పాటు చేసే స్థలాన్ని ఇటీవల రెవెన్యూ, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు పరిశీలించి నివేదికను బీపీసీఎల్‌కు పంపించారు. పెట్రోల్ బంక్ నిర్వహణపై మహిళా సంఘాల సభ్యులకు కంపెనీ శిక్షణ, సౌకర్యాలు కల్పిస్తుందని డీఆర్డీఓ ఎస్.కిషన్ తెలిపారు. నిర్వహణ బాధ్యతలు తీసుకునే మహిళల ఎంపిక ప్రక్రియ చేపడుతున్నామని పేర్కొన్నారు.

ఆందోళన మధ్య ఇళ్ల పట్టాల పంపిణీ

- ఎమ్మెల్యే వినోద్‌ను నిలదీసిన బాధితులు
- అందరికీ న్యాయం చేయాలని ఎమ్మెల్యే ఆదేశం



పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే వినోద్

కాసిపేట: మండలంలోని కేకే ఓపెన్‌కాస్టు నిర్వాసిత గ్రామం దుబ్బగూడెం ప్రజలకు పునరావాస కాలనీలో చేపట్టిన పట్టాల పంపిణీ కార్యక్రమం గురువారం ఆందోళన మధ్య కొనసాగింది. గ్రామంలో పుట్టి పెరిగిన వారికి రాకుండా అధికారులు కుట్ర చేస్తున్నారని బాధితులు ఎమ్మెల్యేను అడ్డుకునే ప్రయత్నం చేశారు. కార్యక్రమంలో నిరసన తెలుపగా.. వేదిక వద్దకు వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. మొత్తం 299మందికి పట్టాలు మంజూరు కాగా, 239మందికి పంపిణీ చేశారు. కొందరు మరణించడం, మరికొందరిపై ఫిర్యాదులు రావడంతో 60 మందికి పంపిణీ నిలిపివేశారు. విచారణ అనంతరం వారికి పంపిణీ చేస్తామని ఆర్డీవో హరికృష్ణ తెలిపారు.

అర్హులందరికీ న్యాయం చేయాలి

సమావేశంలో ఎమ్మెల్యే గడ్డం వినోద్ మాట్లాడుతూ గ్రామంలోని అర్హులందరికీ ఇంటిస్థలం, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అందించి న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. ఏడాదిలోపు పునరావాస కాలనీలో అన్ని ఏర్పాట్లతోపాటు నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని తెలిపారు.

ప్రోటోకాల్ రగడ..

గిరిజన మహిళ అని చిన్న చూపా అంటూ పీఏసీఎస్ చైర్‌పర్సన్ నీలరాంచందర్ ఎమ్మెల్యేను నిలదీశారు. సొంత పార్టీకి చెందిన తమను పట్టించుకోకుండా, ప్రోటోకాల్ లేకుండా నాయకులను వేదికపైకి పిలవడం, తమను అవమానించడం ఏమిటని ప్రశ్నించారు. ఎమ్మెల్యే అనుచరులకు వేదికపై స్థానం కల్పించడం పట్ల పలువురు అభ్యంతరం వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యే అసంతృప్తి

పట్టాల పంపిణీతో పేరు రావాలని ఈ నెల 11, 16న నిర్వహించాల్సిన కార్యక్రమాన్ని అధికారులపై ఒత్తిడి తెచ్చి ఎమ్మెల్యే హాజరవుతారని గురువారం నాటికి వాయిదా వేయించారు. స్థలాలు దక్కని బాధితుల నిరసన, ప్రోటోకాల్ రగడతో సహాయకులతోపాటు నాయకులపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానికంగా పరిస్థితి ఏమిటి, ఏం కావాలి, ఏం చేయగలం అనేది తెలుసుకోకుండా తనను రప్పిస్తారా అంటూ అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ కార్యక్రమంలో ఆర్డీవో హరికృష్ణ, జీఎం దేవేందర్, కాంగ్రెస్ నాయకులు రత్నం ప్రదీప్, రౌతు సత్తయ్య, మైదం రమేష్, గోలేటి స్వామి, దుబ్బగూడెం గ్రామస్తులు పాల్గొన్నారు.

గాలి వీచినా కరెంట్ కట్



మంచిర్యాలలోని రాంనగర్ సబ్‌స్టేషన్

- గంటలకొద్దీ ఎదురు చూపులు
- తరచూ మరమ్మతులు.. ఆగని అవాంతరాలు

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో ఈదురుగాలులు వీచినా.. చిన్నపాటి వర్షం కురిసినా కరెంటు సరఫరా నిలిచిపోతోంది. మళ్లీ ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి నెలకొంటోంది. గత నెల 22న జిల్లాలో ఈదురుగాలులు, వర్షంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఈ నెల 3న ఈదురుగాలులు, వర్షానికి గంటల తరబడి సరఫరా నిలిచిపోయింది. 10న ఈదురుగాలులు, చిన్నపాటి వర్షానికి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో వినియోగదారులు రాత్రంతా జాగారం చేయాల్సి వచ్చింది. జిల్లా కేంద్రంతోపాటు మండలాల్లోనూ ఇదే పరిస్థితి ఎదురవుతోంది. పునరుద్ధరణకు గంటల తరబడి సమయం పడుతోంది. నెలకు రెండు మూడు రోజులు విద్యుత్ మరమ్మతులు, ఆధునీకరణకు ఉదయం నుంచి సాయంత్రం వరకు నిలిపివేస్తున్నారు. అధిక లోడ్‌కు అనుగుణంగా ట్రాన్స్‌ఫార్మర్ల మార్పు, శిథిలావస్థకు చేరిన విద్యుత్ తీగలు, స్తంభాలు, కాసారం, ఫీడర్లు, అధునాతన, సాంకేతిక తదితర పరికరాలు కొత్తవాటిని ఏర్పాటు చేసి మెరుగైన నిరంతర విద్యుత్ సరఫరాకు తరచూ మరమ్మతులు చేపడుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. అయినా గాలివానకు సరఫరా నిలిచిపోయి గంటల తరబడి ఎదురు చూడాల్సి వస్తోంది. మారుమూల గ్రామాల్లోనే కాదు జిల్లా కేంద్రంలోనూ అదే పరిస్థితి ఎదురవుతోంది.

రైతులకూ ఇబ్బందులే..

జిల్లాలో 3,60,214 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. బిల్లుల వసూలు కచ్చితంగా వ్యవహరిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు సరఫరాలో నిర్లక్ష్యం వహిస్తున్నారని వినియోగదారులు మండిపడుతున్నారు. యాసంగి వరి పంటల సాగుకు బోరు మోటార్ల వినియోగం పెరిగింది. దిగుబడి దశలో ఉన్న పంటలకు నీరందిస్తుండగా సరఫరా నిలిచిపోతుండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ఎండలు మండిపోతున్నాయి. మరమ్మతుల పేరిట సరఫరా నిలిపి వేస్తుండడంతో ఉక్కపోతతో ఇళ్లలో ఉండలేకపోతున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా అప్రకటిత కోతలు విధిస్తున్నారని కాలనీల వాసులు వాపోతున్నారు. ప్రతీ నెల రెండో శనివారం విద్యుత్ మరమ్మతుల దే కారణంగా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నిలిపి వేస్తున్నారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది కొరతతో సేవల్లో ప్రభావం కనిపిస్తోంది. జిల్లాలో రోజు రోజుకు విద్యుత్ వినియోగదారులు పెరుగుతుండడం, రూ.కోట్లలో బిల్లులు వసూలవుతున్నా అందుకు అనుగుణంగా సేవలు అందడం లేదనే విమర్శలు వస్తున్నాయి. విద్యుత్ సరఫరాలో అంతరాయంపై ఫోన్ చేస్తే కొందరు ఏడీ, ఏఈ, సిబ్బంది స్పందించడం లేదని వినియోగదారులు ఆరోపిస్తున్నారు.

మెరుగైన సబ్‌స్టేషన్లు ఉన్నా..

నిరంతర విద్యుత్ సరఫరాకు ప్రభుత్వం ఎన్నో చర్యలు చేపట్టింది. సబ్‌స్టేషన్ల మరమ్మతు, తుప్పుపట్టిన స్తంభాలు, ఫీడర్లు, వదులుగా ఉన్న తీగలు సరి చేయడం, కొత్త పరికరాలు బిగించేందుకు నిధులు, సామగ్రి సమకూర్చుతోంది. ప్రతీ మండలానికి ఒకటి రెండు సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేసింది. అధిక లోడ్ పడకుండా చర్యలు తీసుకుంది. ఇటీవల సబ్‌స్టేషన్ల సామర్థ్యం పెంపు కోసం అవసరమైన ట్రాన్స్‌ఫార్మర్లు కేటాయించింది. ఈ క్రమంలో సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాల్సిన అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. కొన్ని చోట్ల పాత స్తంభాలు, వైర్లకు మరమ్మతులు చేయకపోవడంతో కరెంటు సరఫరా నిలిపివేసి ఆ శాఖ సిబ్బంది ముందు జాగ్రత్త పడుతున్నారని తెలుస్తోంది. గాలి వీచినప్పుడు వైర్లకు చెట్ల కొమ్మలు తగిలి సరఫరా నిలిచిపోతోంది. లోఓల్టేజ్, హైఓల్టేజ్ సమస్యలతో ఇంట్లో విద్యుత్ పరికరాలు కాలిపోతున్నాయి.

కోతలు లేకుండా చూడాలి



గాలిదుమారం, చిన్న వర్షం వచ్చినా కరెంటు పోతోంది. ఎప్పుడు వస్తుందో తెల్వదు. పోయిన నెల కురిసిన చిన్న వర్షానికి సాయంత్రం నుంచి రాత్రి వరకు కరెంటు రాలేదు. నెలకు రెండు మూడు రోజులు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు రిపేర్ చేస్తూ కరెంట్ తీస్తున్నారు. విద్యుత్ అధికారులు కరెంటు కోతలు లేకుండా చూడాలి.

– బి.సతీష్, మంచిర్యాల

చిన్నవర్షం వచ్చిందంటే చాలు..

చిన్నపాటి ఈదురుగాలులు, చిన్నవర్షం వచ్చిందటే చాలు కరెంట్ పోతోంది. రాత్రి, పగలు అని తేడా లేకుండా గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోతుండడంతో తీవ్ర ఇబ్బంది పడాల్సి వస్తుంది. విద్యుత్ బిల్లులు క్రమం తప్పకుండా వసూలు చేస్తున్నరు. కానీ విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ఇవ్వడం లేదు. బయటకు వెళ్తే ఎండ. వడగాలులు, ఇంట్లో ఫ్యాను తిరగంది ఉండలేకపోతున్నాం.

– ఆర్.శేఖర్, ఎల్ఐసీ కాలనీ, మంచిర్యాల

కన్నయ్య మృతిపై కలెక్టరేట్ ముట్టడిస్తాం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ
- మృతుడి కుటుంబానికి పరామర్శ

వేమనపల్లి: నాయిని కన్నయ్య కుటుంబానికి న్యాయం చేయకపోతే జిల్లా కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ హెచ్చరించారు. తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం, సీపీఎం రాష్ట్ర నాయకులతో కలిసి గురువారం మండలంలోని మంగెనపల్లి గ్రామానికి వెళ్లి యజమాని వేధింపులకు ఆత్మహత్య చేసుకున్న కన్నయ్య కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సంతాప సభలో మాట్లాడారు. కన్నయ్య కుటుంబానికి చెందిన సీలింగ్ పట్టా భూమిని అక్రమంగా పట్టా చేయించుకున్న యజమాని చిన్నన్న కుమారుడు హరీష్‌పై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. తహసీల్దార్, ఎస్సైలకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఆత్మహత్యకు కారకులైన యజమాని ఎనగంటి చిన్నన్నతోపాటు భార్య లక్ష్మీ, కొడుకు హరీష్‌లపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు. కుటుంబానికి రూ.50 లక్షల నష్టపరిహారం, భార్యకు ప్రభుత్వ ఉద్యోగం, ఐదు ఎకరాల భూమి, ఇందిరమ్మ ఇల్లు ఇప్పించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో 21, 22వ తేదీల్లో మండల కేంద్రాల్లో నిరసనలు తెలపాలని, అధికారులు, ప్రజాప్రతినిధుల ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం గిరిజన సంఘం నాయకులతో భారీ ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ రమేష్, ఎస్సై శ్యాంపటేల్‌లకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీఏజీఎస్ రాష్ట్ర కార్యదర్శి, ఉపాధ్యక్షుడు పూనం సచిన్, బండారు రవికుమార్, సీపీఎం రాష్ట్ర నాయకులు ఆశయ్య, టీఏజీఎస్ రాష్ట్ర నాయకులు కోట శ్రీనివాస్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాగాల రాజన్న, ఎర్మ పున్నం, సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి, ఐద్వా జిల్లా కార్యదర్శి ఉమారాణి, నాయకులు మల్లేశ్వరి, అబ్దుల్లా, ప్రసాద్, చందు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలి

చెన్నూర్: కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జన్‌వేస్లీ అన్నారు. స్థానిక తాపీమేస్త్రీ సంఘ భవనంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికులు, ఆశ్రమ పాఠశాలలో పని చేసే కార్మికులు ఆయనను కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మాట్లాడుతూ ప్రభుత్వ సంస్థల్లో పని చేస్తున్న కార్మికులకు పెండింగ్ వేతనాలు, బిల్లులను చెల్లించాలని తెలిపారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బండారి రవికుమార్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ప్రసాద్‌రావు, జిల్లా కార్యదర్శి సంకె రవి, చందు, రంజిత్, కార్మిక సంఘాల నాయకురాళ్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దాడి కేసులో ఇద్దరు రిమాండ్

జన్నారం: అటవీశాఖ మహిళ బీట్ అధికారి వి ధులకు ఆటంకం కలిగించడమే కాకుండా ఆమెతోపాటు భర్తపై దాడి చేసిన కేసులో ఇద్దరిని గు రువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రాజవర్ధన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..ఈనెల7న జన్నారం మండలం కొత్తపేట సమీపంలో ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తుండగా బీట్ అధికారి రుబీనా తలాత్ ఆపింది. ఆమె తోపాటు భర్త అఫ్రోజ్ వెళ్లాడు. నా ట్రాక్టర్‌ను ఆపుతావ అని కవ్వాల్ గ్రామానికి చెందిన రి యాజొద్దీన్, ఎజాజొద్దీన్‌లు బీట్ అధికారి విధులకు ఆటంకం కలిగించాడు. ఆమె భర్తపై దాడి చేయడంతో కేసు నమోదైంది. విచారణ అనంతరం కోర్టులో హాజరుపర్చగా ఇద్దరిని 14 రోజులు రిమాండ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

భార్యపై గొడ్డలి దాడి ఘటనలో భర్తకు..

కోటపల్లి: వివాహేతర సంబంధంపై ప్రశ్నించిన భార్యపై గొడ్డలితో దాడి చేసిన ఘటనలో నిందితుడు భర్తను గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు. మండలంలోని బొప్పారం గ్రామానికి చెందిన బానోత్ పున్నం తన వివాహేతర సంబంధానికి అడ్డువస్తున్న భార్య లక్ష్మిని గొడ్డలితో దాడిచేసి గాయపర్చాడు. నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత



పోలీసులు పట్టుకున్న ట్రాక్టర్లు

నెన్నెల: మండలంలోని మైలారం మత్తడి వాగు నుంచి అనుమతి లేకుండా బెల్లంపల్లికి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను జోగాపూర్ వద్ద పట్టుకున్నామని ఎస్సై ప్రసాద్ తెలిపారు. బుధవారం రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఈ ట్రాక్టర్లను పట్టుకుని సీజ్ చేశామన్నారు. యజమానులు గడ్డం సాయికుమార్, కొమ్ము రాజన్న, డ్రైవర్లు పసుల రవీందర్, అత్తి సాయిలపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. మండలంలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అగ్నిప్రమాదంలో ఇల్లు దగ్ధం



కాలిపోయిన వస్తువులు

తాంసి: మండలంలోని జామిడికి చెందిన పర్ధాన్ దేవుబాయి ఇల్లు అగ్ని ప్రమాదంలో దగ్ధమైంది. ఒంటరిగా ఉంటున్న ఆమె గురువారం ఉదయం ఇంట్లో దేవుని చిత్రపటం వద్ద దీపం పెట్టి ఉపాధి పనికి కూలీలతో వెళ్లింది. వెలిగించిన దీపం వస్తువులకు అంటుకొని మంటలు వ్యాపించింది. గమనించిన గ్రామస్తులు వెంటనే మోటార్ల ద్వారా నీటిని చల్లి మంటలార్పివేశారు. అప్పటికే ఇంట్లో ఉన్న నిత్యావసర సరుకులు, దుస్తులు, రూ.20వేల నగదు కాలిపోయాయి. ఇంటి పైకప్పు దెబ్బతింది. దాదాపు రూ.లక్షకు పైగా ఆస్తినష్టం వాటిల్లింది. విషయం తెలుసుకున్న సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్‌రెడ్డి ఘటనస్థలానికి చేరుకుని బాధిత మహిళను పరామర్శించారు. నెలకు సరిపడా సరుకులతోపాటు నగదు అందజేశారు. యూత్ కాంగ్రెస్ నాయకుడు అశోక్ ఆర్థికసాయం అందజేశాడు.



సినిమా చిత్రీకరణలో నటీనటులు

మన చిత్రం.. జగమెరిగిన సత్యం

- చింతలమానెపల్లి మండలం దిందా గ్రామంలో చిత్రీకరణ
- దర్శకుడు, నటులూ స్థానికులు..
- నేడు విడుదల

సినిమా అంటే ఒక క్రేజ్.. రంగులతో కనిపించే సినిమా చాలామందికి కల.. ఇలాంటి ఓ సినిమా మన ప్రాంతంలో రూపుదిద్దుకుంటే ఆ ఆనందం వేరు. ఎలాంటి ప్రాచుర్యానికి నోచుకోని ఆ గ్రామంలోని వెనుకబడిన పరిస్థితులు, గ్రామస్తుల సహజ అమాయకత్వం ఈనేపథ్యంలో చింతలమానెపల్లి మండలంలోని దిందా గ్రామ కేంద్రంగా రూపుదిద్దుకున్న చిత్రం.. జగమెరిగిన సత్యం..ఈనెల 18న సినిమా విడుదల కానుంది.

చింతలమానెపల్లి: మండలంలోని దిందా.. ఒక మారుమూల గ్రామం.. త్వరలో రంగస్థలానికి పరిచయమవుతోంది. దట్టమైన అటవీ ప్రాంతంలో రవాణా సౌకర్యాలకు, గ్రామం అభివృద్ధికి నోచుకోకుండా ఉంది. జగమెరిగిన సత్యం టైటిల్‌తో విడుదల అవుతున్న చిత్రం 80 శాతం గ్రామంలోనే చిత్రీకరించారు. గ్రామ సమీపంలోని వాగు, చింతలమానెపల్లి మండలం రవీంద్ర నగర్ వారసంత, గూడెం ప్రాణహిత నది వంతెన, పెంచికల్‌పేట్ పెద్దవాగు, కౌటాల మండల కేంద్రం, పక్కనే మహారాష్ట్రలోని అహేరి వద్ద కొన్ని సన్నివేశాలను తెరకెక్కించారు. కౌటాల ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో మొదటి సన్నివేశం చిత్రీకరణతో సినిమా ప్రారంభించారు.

1994లో గ్రామీణ పరిస్థితుల నేపథ్యం..

1994లోని గ్రామీణ నేపథ్యం, అప్పటి మనుషుల కట్టుబాట్లు, దర్శకుడి చిన్నతనంలోని అనుభవాలను ఆధారంగా చిత్రం రూపొందింది. ప్రేమ సన్నివేశాలు, భావోద్వేగాలు, సంస్కృతి, సంగీతం ప్రధానంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించినట్లు దర్శకుడు పాలె తిరుపతి తెలిపారు. ఇందులో పలు సన్నివేశాల్లో దిందా గ్రామస్తులను బ్యాక్‌గ్రౌండ్‌లో నటించేందుకు అవకాశం కల్పించారు. సినిమాలో ఐదు పాటలు ఉండగా బతుకమ్మ పాటను గాయకురాలు మంగ్లీ ఆలపించారు. రాణా దగ్గుబాటి, సాయిపల్లవి నటించిన విరాట పర్వం చిత్రానికి పనిచేసిన సురేష్ బొబ్బిలి ఈచిత్రానికి సంగీత దర్శకత్వం వహించారు. హీరో రవితేజ మేనల్లుడు అవినాష్‌వర్మ, ఆద్యారెడ్డిలను హీరో, హీరోయిన్లుగా తొలిపరిచయం చేశామని, మరో హీరోయిన్‌గా నీలిమ పతకంశెట్టి నటించినట్లు దర్శకుడు తెలిపారు.

దర్శకుడు స్థానికుడే..

దర్శకుడు పాలె తిరుపతి స్వగ్రామం పెంచికల్‌పేట్ మండలం చెడ్వాయి. ఆయనకు చింతలమానెపల్లి మండలంలో బంధువులు ఉండగా వారి ఇంటికి వచ్చేక్రమంలో స్థానిక గ్రామాలపై పరిచయం ఉండగా సినిమా చిత్రీకరణకు కారణమైంది. గ్రామంలో ప్రాథమిక విద్యాభ్యాసం చేసిన ఆయన మంచిర్యాలలో డిగ్రీ పూర్తిచేశారు. సినిమాలపై ఆసక్తితో చిత్రరంగానికి వెళ్లి దర్శకత్వ శాఖలో 8 ఏళ్లు పనిచేశారు. ఈక్రమంలో 'కొరియన్ శీర్షిక అహేరి' పేరుతో లఘు చిత్రం రూపొందించారు. అది సాధించిన విజయం ఇచ్చిన స్ఫూర్తితో మరో నాలుగు లఘు చిత్రాలను రూపొందించగా, ఈ అనుభవంతో జగమెరిగిన సత్యం చిత్రాన్ని తెరకెక్కించారు. కథానాయకుడికి చిన్నతనంలో సోదరుడిగా చింతలమానెపల్లి మండలం గంగాపూర్‌కు చెందిన దంద్రె మణికంఠ(బబ్లూ) బాలనటుడిగా నటించాడు.

జిల్లాలో ఆలస్యంగా విడుదల

జగమెరిగిన సత్యం సినిమా కుమురం భీం జిల్లాలో కాస్త ఆలస్యంగా విడుదల కానుంది. ఈనెల 18 (శుక్రవారం)న మంచిర్యాలలో, తెలంగాణలో 33 థియేటర్లలో విడుదల చేస్తున్నారు. కాగజ్‌నగర్‌లో ఇతర సినిమాలకు ముందుగానే షెడ్యూల్ ఖరారు అయి ఉండడంతో కొన్నిరోజుల అనంతరం విడుదల అవుతుందని సినిమా బృందం తెలిపింది.



నటులకు సీన్ వివరిస్తున్న దర్శకుడు పాలె తిరుపతి

గర్వంగా భావిస్తున్నాం



దిందా గ్రామం పేరు వెండితెరపై వినిపించడం పట్ల మేము గర్వంగా భావిస్తున్నాం. స్థానికంగా చిత్రీకరణ జరగడంతో కొంతమందికి ఉపాధి లభించింది. అటవీ ప్రాంతంలో ఉండే మా గ్రామం అభివృద్ధిలో వెనుకబడి ఉంది. సినిమాతో గ్రామానికి ప్రచారం లభించడం మేము సంతోషంగా ఉన్నాం.

– డోకె రామన్న, దిందా

సహకారం అందించాం



సినిమా చిత్రీకరణకు అనువైన ప్రదేశాల కోసం సోదరుడు అయిన డైరెక్టర్ నన్ను సంప్రదించారు. ఎన్నో ప్రాంతాలను పరిశీలించి దిందా గ్రామాన్ని ఎంపిక చేసుకున్నాం. సినిమా చిత్రీకరణ పూర్తయ్యే వరకు సినిమా బృందానికి నాతో కలిసి గ్రామస్తులు, స్థానిక ప్రజలు సహకారాలు అందించాం. సినిమా విజయవంతం కావాలని కోరుకుంటున్నాం.

– దేవాడి రాజన్న, గంగాపూర్

బాలనటుడిగా మరిచిపోలేనిది



సినిమాలో నటించే అవకాశం రావడం ఒక వరం లాంటిది. నేను 8వ తరగతి చదువుకునే సమయంలో దగ్గరి బంధువు అయిన సినిమా దర్శకుడు అవకాశం కల్పించారు. నటనలో అనుభవం లేకున్నా దర్శకుడు, నటుల సహకారంతో బాలనటుడిగా నటించాను. ఈ అనుభవం మరిచిపోలేనిది.

– దంద్రె మణికంఠ(బబ్లూ), గంగాపూర్

ఓపెన్ 'పది', ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు

మంచిర్యాలఅర్బన్: ఈ నెల 20నుంచి ప్రారంభమయ్యే ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డీఈవో యాదయ్య తెలిపారు. ఉదయం 9నుంచి 12గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. మంచిర్యాలలో పదో తరగతికి రెండు పరీక్ష కేంద్రాలు, ఇంటర్ పరీక్షలకు మూడు, బెల్లంపల్లిలో పదో తరగతికి ఒకటి, ఇంటర్‌కు రెండు కేంద్రాలు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పదో తరగతి విద్యార్థులు 666, ఇంటర్ విద్యార్థులు 1192 మంది పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. విద్యార్థులకు హాల్‌టికెట్లు స్టడీ సెంటర్ల ద్వారా పంపిణీ చేస్తామని, విద్యార్థులతోపాటు సిబ్బంది పరీక్ష కేంద్రాల్లోకి ఎలాంటి పరికరాలు, సెల్‌ఫోన్లు తీసుకు రావద్దని సూచించారు.

న్యాయవాదిపై దాడి దుర్మార్గపు చర్య



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

మంచిర్యాలక్రైం: న్యాయవాదులపై దాడులు దుర్మార్గపు చర్య అని మంచిర్యాల జిల్లా బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు అన్నారు. ఈ నెల 16న సూర్యపేట జిల్లా న్యాయవాది మాంతపురం కిషోర్‌పై దాడిని ఖండిస్తూ గురువారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. జిల్లా బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు భుజంగ్‌రావు, న్యాయవాదులు మాట్లాడుతూ దాడులపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తుల అంజనేయులు, ధత్తు, గోపతిరవి, శ్రీరాములు, జాడీ తిరుపతి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విధుల బహిష్కరణ

లక్సెట్టిపేట: న్యాయవాది కిషోర్‌పై దాడిని నిరసిస్తూ గురువారం మండల కేంద్రంలోని మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయవాదులు విధులు బహిష్కరించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొమిరెడ్డి సత్తన్న, ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌కుమార్, ఉపాధ్యక్షులు నళినికాంత్, కోశాధికారి సుమన్ చక్రవర్తి, న్యాయవాదులు భూమరెడ్డి, సురేందర్, అక్కల శ్రీధర్, కిరణ్‌కుమార్, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

ఒంటరితనం భరించలేక వృద్ధుడి ఆత్మహత్య



పోశెట్టి మృతదేహం

సారంగపూర్: ఒంటరితనం భరించలేక వృద్ధుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. కుటుంబీకులు, ఎస్సై తెలిపిన వివరాలు.. మండలంలోని వంజర్ గ్రామానికి చెందిన తోకల పోశెట్టి(65)కి ఇద్దరు భార్యలు ఉన్నారు. పెద్ద భార్యకు ఇద్దరు కుమార్తెలు, చిన్న భార్యకు ఒక కుమార్తె ఉన్నారు. అయితే గత 20 ఏళ్లుగా కుటుంబానికి దూరంగా ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. స్థానిక హనుమాన్ ఆలయంలో వంట, బస చేస్తూ కాలం వెళ్లదీశాడు. ఇటీవల ఆయన అనారోగ్యానికి గురికావడంతో తిరిగి ఇంటికి వెళ్లాడు. కుటుంబ సభ్యులకు ముఖం చూపించలేక, ఒంటరిగా బతకలేక తనలో తానే కుమిలిపోయాడు. ఈక్రమంలో రెండు రోజులుగా పోశెట్టి కనిపించడం లేదని గ్రామస్తులు అనుకుంటున్నారు. గ్రామశివారు ప్రాంతంలోని దడే గుట్ట వద్ద ఒర్రె వైపు పశువులు మేపేందుకు వెళ్లిన వారికి గురువారం పోశెట్టి ఉరేసుకుని కనిపించాడు. ఈ విషయాన్ని గ్రామస్తులు, ఆయన కుటుంబీకులకు చేరవేశారు. గ్రామస్తులు అందించిన సమాచారంతో ఎస్సై ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం నిర్మల్ ఏరియాస్పత్రికి తరలించారు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వివాహిత..



గడ్డం లావణ్య(ఫైల్)

నెన్నెల: ఆర్థిక ఇబ్బందులతో వివాహిత బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన గడ్డం లావణ్య (47), భర్త శంకర్ గౌడ్‌తో కలిసి తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఎదుట హోటల్ నిర్వహిస్తోంది. హోం లోన్ తీసుకుని ఇల్లు నిర్మించుకున్నారు. హోటల్ పెట్టుబడి కోసం మరికొంత అప్పు చేశారు. వ్యాపారం సరిగ్గా సాగక పోవడంతో అప్పు తీర్చడం కష్టమైంది. కిస్తీలు చెల్లించకపోవడంతో వడ్డీ పెరిగిపోయింది. అప్పులు ఎలా తీర్చాలో అని ప్రతిరోజు బాధపడేదని కుటుంబీకులు చెప్పారు. ఈక్రమంలో గురువారం తెల్లవారుజామున లావణ్య ఇంట్లో కనిపించలేదు. ఆమె ఆచూకీ కోసం కుటుంబసభ్యులు చుట్టూ పక్కల వెతకగా భీరన్నమఠ్రి సమీపంలోని వ్యవసాయ బావి వద్ద ఆమె చెప్పులు లోట కనిపించాయి. అనుమానంతో బావిలో నీటిని మోటార్ల ద్వారా తోడగా అందులో శవమై కనిపించింది. కుమారుడు వెంకటేశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్యాయత్నం

దహెగాం: అదనపు కట్నం కోసం భర్త, అత్తమామల వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్యాయత్నం చేసింది. మండలంలోని కోత్మీర్ గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్సై కందూరి రాజు కథనం ప్రకారం..దహెగాం మండలం కోత్మీర్ గ్రామానికి చెందిన బొలిశెట్టి వెంకటేశ్‌కు కాగజ్‌నగర్ మండలం రాస్పెల్లికి చెందిన జ్యోతితో 14 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ముగ్గురు కుమారులు ఉన్నారు. వెంకటేశ్ సింగరేణికార్మికుడిగా బెల్లంపల్లిలో పనిచేస్తున్నాడు. వీరి కాపురం సాఫీగా సాగింది. ఏడాది క్రితం నుంచి భర్త, అత్త భాగ్య, మామ మొండయ్య అదనపు కట్నం తేవాలని ఆమెను వేధించసాగారు. బుధవారం వేధించడంతో భరించలేని జ్యోతి అందరి ముందే పురుగుల మందు తాగింది. వెంటనే కుటుంబీకులు చికిత్స నిమిత్తం కాగజ్‌నగర్‌కు తరలించారు. ప్రస్తుతం చికిత్స పొందుతుంది. జ్యోతి తల్లి పెర్క సుశీల ఫిర్యాదుతో భర్త, అత్తమామలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి రైతు మృతి



అశోక్ (ఫైల్)

దండేపల్లి: మండలంలోని నర్సాపూర్ గ్రామానికి చెందిన రైతు గాండ్ల అశోక్ ప్రమాదవశాత్తు బావిలో పడి మృతిచెందాడు. ఎస్సై తహసీనొద్దీన్ కథనం ప్రకారం.. అశోక్ (45) గురువారం ఉదయం పొలం వద్దకు వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. చాలాసేపటి వరకు రాకపోవడంతో ఫోన్ చేస్తే ఇంట్లో ఉంది. దీంతో బంధువు అయిన కార్తీక్‌ను పొలం వద్దకు పంపించారు. పొలం ఒడ్డున ఒక చెప్పు, బావిలో మరో చెప్పు కనిపించింది. దీంతో వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని ఈతగాళ్లతో బావిలో వెతకగా మృతదేహం లభించింది. ప్రమాదవశాత్తు బావిలో జారిపడటంతో ఈత రాక అందులో మునిగి చనిపోయాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య శైలజ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

బ్లేడ్‌తో గొంతుకోసి హత్యాయత్నం

ఆదిలాబాద్‌రూరల్: బ్లేడ్‌తో ఒకరి గొంతు కోసి హత్యాయత్నం చేసిన ఘటన మండలంలోని బంగారుగూడలో చోటుచేసుకుంది. ఎస్సై ముజాహిద్ కథనం ప్రకారం..బంగారుగూడకు చెందిన ముద్దంగుల విఠల్, అదేకాలనీలో జాబిర్‌షా ఉంటున్నాడు. గురువారం విఠల్ ఫోన్‌లో ఓ నంబర్ డయల్ చేయాలని జాబిర్ షా అడిగాడు. ఇందుకు విఠల్ నిరాకరించడంతో బ్లేడ్‌తో ఆయన గొంతుకోసి హత్యాయత్నం చేశాడు. తీవ్ర గాయాలైన విఠల్‌ను రిమ్స్‌కు తరలించారు. బాధితుడి భార్య పోచవ్వ ఫిర్యాదుతో హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

ఆరుగురి బైండోవర్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ పోలీసు స్టేషన్ పరిధిలో ఆరుగురు పాత నేరస్తులను గురువారం తహసీల్దార్ శ్రీనివాసరావుదేశ్‌పాండే ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై స్వరూప్‌రాజ్ తెలిపారు. వేంపల్లిలో దోపిడీ కేసులో నిందితులైన రమేశ్, అవినాశ్, చందు, సంతోశ్, అశోక్, కృష్ణలను ఏడాదిపాటు షరతులతో కూడిన బైండోవర్ చేశారు.

తల్వార్‌తో ఫొటో దిగిన ఇద్దరిపై కేసు

గుడిహత్నూర్: బర్త్ డే పార్టీలో తల్వార్‌తో ఫొటో దిగి సోషల్ మీడియాలో షేర్ చేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ భీమేష్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..మండల కేంద్రానికి చెందిన యువకులు తరుణ్ గిత్తే, సునీల్ బుధవారం రాత్రి మహంకాళి మందిరం వద్ద జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. కేక్ కట్ చేసిన అనంతరం వేడుకకు హాజరైన మండల కేంద్రానికి చెందిన మిత్రులు నరేశ్, వెంకటి తల్వార్లతో ఫొటోలకు ఫోజు ఇచ్చారు. సోషల్ మీడియాలో షేర్ చేశారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేలా ఉండడంతో వీరిపై గురువారం కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఆయుధాలతో ఫొటో, వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టులు చేస్తే కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

మద్యం విక్రయిస్తున్న ఇద్దరిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు. పట్టణంలోని కుమార్‌పేట్‌కు చెందిన తోకల నాగరాజు అశోక్‌రోడ్‌లోని తన పాన్‌షాప్‌లో తక్కువ ధరకు మద్యం కొనుగోలు చేసి అధిక ధరకు విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయన నుంచి 3.65 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీటి విలువ రూ.4వేల వరకు ఉంటుందన్నారు. అదేవిధంగా తిర్పెల్లికి చెందిన కరోర శుభం ఇంట్లో మద్యం విక్రయిస్తుండగా ఆయనపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆయన నుంచి 3.42 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. వీటి విలువ రూ.3762 ఉందని వివరించారు.

అసభ్యపదజాలంతో దూషించిన వ్యక్తిపై..

ఆదిలాబాద్‌టౌన్: సోషల్ మీడియాలో అసభ్య పదజాలంతో కాంగ్రెస్ నాయకులను దూషించిన వ్యక్తిపై గురువారం కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. ఈనెల 16న వాట్సాప్ గ్రూప్‌లో కాంగ్రెస్ నాయకులను ఉద్దేశించి అసభ్య పదజాలంతో పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన శైలేష్ బొత్కుర్‌వార్ దూషించినట్లు యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ఉపాధ్యక్షుడు సామ రూపేష్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. నాయకుల వ్యక్తిత్వాన్ని కించపర్చడంతోపాటు ప్రజలను రెచ్చగొట్టేలా పోస్టు ఉందని తెలిపారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

జూదరుల అరెస్టు

దండేపల్లి: మండలంలోని నంబాల గ్రామ సమీపంలో గురువారం నలుగురు వ్యక్తులు పేకాట ఆడుతుండగా పట్టుకున్నట్లు ఎస్సై తహసీనొద్దీన్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.7500 నగదు స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. కేసు నమోదు చేసినట్లు వివరించారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు



నిందితుడిని జైలుకు తరలిస్తున్న ఎస్సై

బెల్లంపల్లి: చోరీ కేసులో కోర్టుకు హాజరుకాకుండా తప్పించుకు తిరుగుతున్న నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. టూటౌన్ ఎస్సై కె.మహేందర్ కథనం ప్రకారం.. 2022లో టూటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో దొంగతనం జరిగింది. చోరీ కేసులో నిందితుడిగా ఉన్న పంజాబ్ రాష్ట్రానికి చెందిన హరదీప్‌సింగ్ కొంతకాలం నుంచి కోర్టు వాయిదాలకు హాజరుకాకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. నిందితుడి ఆచూకీని కనుగొని పోలీసులు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో చాకచక్యంగా పట్టుకుని గురువారం బెల్లంపల్లి జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చారు. అనంతరం ఆసిఫాబాద్ జైలుకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

దేశీదారు విక్రయిస్తున్న ఇద్దరు..



దేశీదారు, నిందితులతో ఎక్సైజ్ పోలీసులు

తాంసి: అక్రమంగా మహారాష్ట్ర నుంచి దేశీదారు తీసుకువచ్చి విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ఆదిలాబాద్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ రేండ్ల విజేందర్ తెలిపారు. మండలంలోని లీంగూడ గ్రామానికి చెందిన ఆత్రం దేవ్‌రావు, టేకం బర్కత్‌రావులు మహారాష్ట్ర నుంచి దేశీదారు తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. పక్కాసమాచారం మేరకు సిబ్బందితో కలిసి బుధవారం రాత్రి దాడి చేశారు. మద్యం విక్రయిస్తుండగా ఇద్దరిని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.10వేల విలువ గల 90 ఎంఎల్ కలిగిన 280 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అరెస్ట్ చేసి జైలుకు తరలించినట్లు పేర్కొన్నారు. ఎవరైనా దేశీదారు, నాటుసారా విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది శ్రీధర్, హనుమంత్ పాల్గొన్నారు.

ఇద్దరు గంజాయి విక్రేతలు..

నేరడిగొండ: మండలంలోని లింగట్లలో కొందరు గంజాయి విక్రయిస్తున్నారని సమాచారం మేరకు ఇచ్చోడ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జుల్ఫేఖార్ అహ్మద్ సిబ్బందితో గురువారం తనిఖీ నిర్వహించారు. సాబ్లే రంజిత్, సాబ్లే సంజీవ్‌లు గంజాయితో పట్టుబడ్డారు. రంజిత్ వద్ద సుమారు 184 గ్రాముల డ్రై గంజాయి, సంజీవ్ వద్ద 223 గ్రాముల గంజాయి లభించినట్లు తెలిపారు. ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఎవరైనా గంజాయి అమ్మినా విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఇళ్లపట్టాలు ఇప్పించాలి



ఎమ్మెల్యే వినోద్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి నివాసం ఉంటున్న పుర ప్రజలకు జీవో నెంబర్ 76 ప్రకారం ఇళ్ల పట్టాలు ఇప్పించాలని సీపీఐ నాయకులు కోరారు. గురువారం ఏఎంసీ ఏరియాలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్రసమితి సభ్యులు ఎ. వెంకటస్వామి, బి.పూర్ణిమ, సీపీఐ పట్టణ, మండల కార్యదర్శులు ఆడేపు రాజమౌళి, బి.లక్ష్మీనారాయణ, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేకల రాజేశం, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలల నుంచి దరఖాస్తుల స్వీకరణ

మంచిర్యాలటౌన్: వచ్చే విద్యా సంవత్సరం 2025-26కు గాను రెప్యూటెడ్(కార్పొరేట్) జూనియర్ కళాశాలల పథకం కోసం జూనియర్ కళాశాలల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు పోటు రవీందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, దివ్యాంగులు, మైనారిటీ విద్యార్థులకు ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్లు కల్పించేందుకు జిల్లాలోని ప్రైవేటు జూనియర్ కళాశాలల నుంచి రెప్యూటెడ్ జూనియర్ కళాశాలను నూతనంగా ఎంపిక చేసేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు.

దానాపూర్ ఎక్స్‌ప్రెస్ పొడిగింపు

బెల్లంపల్లి: దానాపూర్ ఎక్స్‌ప్రెస్ (నెం.07419/20) రైలు గడువును రైల్వే శాఖ గురువారం పొడిగించింది. స్పెషల్‌ట్రైన్ ప్రస్తుత కాలపరిమితి ఈనెల 17 వరకు ఉండగా ఈనెల 28వ తేదీ వరకు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. ఎండాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని సమ్మర్ స్పెషల్ ట్రైన్‌గా నడిపించనుంది. ఈనెల 19న చర్లపల్లి నుంచి ఈ రైలు బయల్దేరనుంది. అదేతీరుగా 21న దానాపూర్ నుంచి చర్లపల్లికి రిటన్ అవుతుంది. కాజీపేట్-బల్లార్షా సెక్షన్ పరిధిలో ఈ రైలు కాజీపేట్, పెద్దపల్లి, బెల్లంపల్లి, సిర్పూర్ కాగజ్‌నగర్, బల్లార్షా జంక్షన్‌లో ఆగుతుంది.